
సాక్షి
కృష్ణాజిల్లా
ఆదివారం । 31 । మార్చి । 2024



ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్

ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ విజయవాడ నగరంలో శనివారం నిర్వహించారు.

-IIలో▸



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.50 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఆదాయం రూ.11.05 లక్షలు

నెమలి(గంపలగూడెం): వేణుగోపాలస్వామి ఆలయం హుండీ కానుకల లెక్కింపులో రూ.11.05 లక్షల ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ వెంకట సాంబశివరావు తెలిపారు.

	ఇఫ్తార్ (ఆది)	సహారి (సోమ)
విజయవాడ	6.25	4.42
జగ్గయ్యపేట	6.28	4.49
మచిలీపట్నం	6.24	4.43
గుడివాడ	6.25	4.45

రంజాన్ వేళలు

జోరుగా ప్రచార పర్వం



గుడివాడ పట్టణంలో ప్రజలకు అభివాదం చేస్తూ ప్రచారం చేస్తున్న కొడాలి నాని

- గుడివాడలో దూసుకుపోతున్న కొడాలి నాని
- గ్రామాల్లోనే బస చేసి ఓటర్లకు చేరువవుతున్న మంత్రి జోగి రమేష్
- ఇప్పటికే నియోజకవర్గాన్ని చుట్టేసిన పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్
- మచిలీపట్నం, పెడన, అవనిగడ్డలో విస్తృతంగా అభ్యర్థుల ప్రచారం
- గన్నవరంలో ఎమ్మెల్యే వంశీ ఇంటింటి ప్రచారానికి శ్రీకారం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో పలు పార్టీల అభ్యర్థులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. కుటుంబసభ్యులు సైతం ప్రచారంలో పాల్గొంటున్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గడప గడప పేరుతో నియోజక వర్గాన్ని చుట్టేశారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో చేసిన మేలును వివరించారు. ప్రతి నియోజకవర్గంలో బీసీ సభలు నిర్వహించారు. ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వమిచ్చిన ప్రాధాన్యం, అందించిన సంక్షేమ ఫలాలను వివరించారు. మే 13 పోలింగ్ కావడంతో ఆ సమయాన్ని వైఎస్సార్ సీపీ అభ్యర్థులు వినియోగించుకుంటున్నారు.

గుడివాడ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే కొడాలి నాని ప్రచారంలో దూసుకుపోతున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు వివరిస్తూ అవకాశం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. పట్టణంలో ఆయన పర్యటిస్తూ ఓటర్లలో జోష్ నింపుతున్నారు.

- పెనమలూరు నియోజక వర్గంలో మంత్రి జోగి రమేష్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలతో ప్రజలను అక్కున చేర్చుకొంటున్నారు. గ్రామాల్లోనే బస చేసి ఇంటింటి ప్రచారం జోరుగా సాగిస్తున్నారు. అవ్వ, తాత, అక్కా, బావ అంటూ పలుకరిస్తూ ఇంట్లో మనిషిగా మెలుగుతున్నారు. ఓ వైపు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు.
- పామర్రు నియోజకవర్గంలో గడప గడప కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే కైలే అనిల్ నియోజకవర్గాన్ని చుట్టేశారు. గ్రామాల్లో ఉన్న నాయకులు అందరినీ ఏకతాటిపైకి తెచ్చారు. ఓటర్లకు తలలో నాలుకలా మెలుగుతూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. గ్రామాల్లో ప్రతి గడపకు తిరుగుతూ, కుటుంబ సభ్యుడిగా కలిసిపోతూ ఓటర్ల అభిమానాన్ని చూరగొంటున్నారు. వినూత్నంగా ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. నియోజకవర్గ సమస్యలు, ప్రజల ఇబ్బందులు తొలగిస్తానంటూ వారి అభిమానాన్ని పొందుతున్నారు.
- మచిలీపట్నం అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి ఇంటింటి ప్రచారం చేస్తూ ఓటర్లతో మమేకమవుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గమంతా చుట్టేసిన ఆయన, ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా ఓటర్ల వద్దకు వెళుతున్నారు. తనదైన శైలిలో ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ప్రచారంతో తండ్రిని మించిన తనయుడిగా ఓటర్లలో మంచి పేరు తెచ్చుకొన్నారు. ఆయన ప్రచారం ప్రజల్లో జోష్ నింపుతోంది. ఎమ్మెల్యే పేర్ని నాని తనయుడి గెలుపు కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. నేరుగా నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజల ఇళ్లకు వెళుతున్నారు. ఓటర్లను తమవైపు ఉండేలా చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వేలకోట్లతో మచిలీపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతోపాటు, ప్రజలకు అందుబాటులో ఉండటం కలిసి వస్తోంది.
- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ 'గడప గడప' కార్యక్రమం మొదలు పెట్టినప్పటి నుంచి ప్రజల్లోనే ఉంటున్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను వివరిస్తూ ఓటర్లకు చేరువయ్యారు. ఆయన ప్రచారానికి ప్రజల నుంచి విశేషంగా మద్దతు లభిస్తోంది. రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన వారు కావడం, నియోజకవర్గంలో విస్తృతంగా ఉన్న పరిచయాలు, డాక్టర్‌గా పేదలకు సేవలు అందించడం, మంచిపేరు ఉండటంతో ఎమ్మెల్యేకు అదనపు బలం చేకూరుతోంది. వీరిద్దరూ కలిసికట్టుగా నియోజక వర్గంలో తిరుగుతున్నారు.
- గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు నుంచి ప్రచారం ప్రారంభించారు. పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొన్నారు. గురువారం గన్నవరం, బాపులపాడు నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. పార్టీ కార్యాలయం నాయకులు, కార్యకర్తలతో కోలాహలంగా మారింది. ఎమ్మెల్యే వంశీ రెండు రోజులుగా నాయకులతో నిర్వహించే సమావేశాలు పార్టీలో నూతనోత్తేజం నింపింది.



పామర్రులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

విశేష స్పందన

పెడన నియోజకవర్గంలో అభ్యర్థి ఉప్పాల రాము, ఆయన సతీమణి జెడ్పీ చైర్‌పర్సన్ హారిక నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు గ్రామాల్లో అందుబాటులో ఉండి ఓటర్లను కలుసుకుంటున్నారు. గ్రామాల్లో ఉన్న నాయకులను సమన్వయం చేసుకొని అందరినీ కలుపుకొనిపోతున్నారు. జగనన్నను సీఎంను చేద్దాం అంటూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. గ్రామాల్లో బాబాయి, పిన్ని అక్కా, పెద్దమ్మ అంటూ వరుసలు కలుపుతూ తన భర్తను గెలిపించాలని హారిక కోరుతున్నారు. వీరు చేస్తున్న ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభిస్తోంది.



బంటుమిల్లి మండలం మల్లంపూడి గ్రామంలో ప్రజాదీవెన కార్యక్రమంలో రాము, హారిక

న్యూస్‌రీల్

భక్తులకు మజ్జిగ పంపిణీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులకు దేవదాయ శాఖ కమిషనర్ కె.సత్యనారాయణ మజ్జిగ పంపిణీ చేశారు. శనివారం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో రామారావు ప్రసాదాలు ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రానికి విచ్చేసిన కమిషనర్ సత్యనారాయణ స్వయంగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. దాతల విరాళాలతో సుమారు రెండు నెలల పాటు మజ్జిగ చలివేంద్రాన్ని నడుపుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు దేవస్థానం చేస్తున్న సేవ అభినందనీయమని తెలిపారు.

హోంగార్డ్ కుటుంబాలకు ఆర్థిక చేయూత




విజయవాడస్పోర్ట్స్: పోలీస్ కమిషనరేట్ పరిధిలో హోంగార్డ్‌గా విధులు నిర్వర్తించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన టి.కమలకు, హోంగార్డ్‌గా విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన జి.గంగాధరరావు కుటుంబానికి కమిషనరేట్ పరిధిలోని హోంగార్డులు ఆర్థిక ఆసరా కల్పించారు. కమల, గంగాధరరావు కుటుంబాలకు హోం గార్డులు అందరూ కలిసి వారి ఒక్కరోజు వేతనాన్ని సమకూర్చారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో టి.కమలకు రూ.5 లక్షలు, గంగాధరరావు భార్య నాగలక్ష్మికి రూ.5 లక్షల చెక్కులను ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ కమాండెంట్ జి.చంద్రబాబు, డీఎస్పీ కె.వి.ఎస్.ఎన్.పరమేశ్వరరావు, ఆర్ఐ కె.సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

జనసేన మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా బాలశౌరి



సాక్షి, మచిలీపట్నం: జనసేన మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి పేరు ఖరారైంది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బాలశౌరి పేరును అధికారికంగా ప్రకటిస్తూ శనివారం ప్రకటన విడుదల చేసింది. 2019లో వైఎస్సార్ సీపీ ఎంపీగా గెలుపొందిన ఆయన రెండు నెలల క్రితం జనసేనలో చేరారు. ఎన్నికల నేపథ్యంలో టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకోవడంతో అభ్యర్థి ప్రకటనలో తీవ్ర జాప్యం జరిగింది. ఆయన్ను ఎంపీగా కాకుండా అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థిగా పంపడానికి పార్టీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు ఇటీవలే చర్చ జరిగింది. చివరకు ఆయన్ను మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఇదిలా ఉండగా అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి ఆశావహులు అధికంగా ఉండటంతో అక్కడ సర్వే చేస్తున్నామని, రిపోర్టు ఆధారంగా అక్కడ అభ్యర్థిని ప్రకటిస్తామని పార్టీ పేర్కొంది.

దుర్గమ్మకు కానుకగా పగడాల దండ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు శనివారం బంగారం పూసలతో తయారుచేసిన పగడాల దండను కానుకగా సమర్పించారు. బర్కత్‌పురకు చెందిన చెరువు ఆంజనేయశాస్త్రి దంపతులు రూ.2 లక్షల విలువైన 25 గ్రాముల బంగారపు దండను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు పంపిణీ చేశారు.

దేశ పురోగతిలో మహిళల పాత్ర కీలకం

అధికార భాషా సంఘం చైర్మన్ విజయబాబు



మాట్లాడుతున్న విజయబాబు, వేదికమీద రాజకుమారి, న్యాయమూర్తి రంజని తదితరులు

విజయవాడ కల్చరల్: దేశ పురోగతిలో మహిళల పాత్ర విస్మరించలేనిదని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు అన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం, వివిధ రంగాల్లోని మహిళలకు భారత మహిళా శిరోమణి పురస్కారాల ప్రదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయబాబు మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లోనూ విజయాలు సాధిస్తునట్లు తెలిపారు. విజయనగరం మొదటి అడిషనల్ జడ్జి గండూరి రంజని మాట్లాడుతూ మహిళా సాధికారతను స్వాగతించాలన్నారు. న్యాయవాద వృత్తిలో వేలాది మంది మహిళలు తమ ప్రతిభను చాటుకుంటున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి వివిధ రంగాల్లో మహిళలు అంశంగా ప్రసంగించారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ వ్యవస్థాపకుడు కొల్లూరి సంస్థ లక్ష్యాలను వివరించారు. సినీ నటుడు కాదంబరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ మగవాని ప్రతి విజయంలోనూ మహిళా శక్తి ఉంటుందని చెప్పారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా అక్కగా ఆమె ముందుకు నడిపిస్తుందన్నారు. కార్యక్రమాన్ని ఎక్స్‌రే కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు, కోశాధికారి సీహెచ్‌వీ సుబ్బయ్య, సభ్యుడు రవికిరణ్ నిర్వహించారు. ధనదుర్గ, వెంకట రమణ, అన్నేకుసుమ, కె.శారద, ఉమాదేవి, డాక్టర్ కేవీఎల్ సుకన్యారావు, దోసపాటి పద్మజ, పిల్లి లక్ష్మీ తులసి, యక్కటి విజయదుర్గాపావని, మెహరున్నీసా, డాక్టర్ సరిత, బత్తుల మహేశ్వరి, టీజీ పద్మావతి, అంజనిలకు పురస్కారాలు ప్రదానం చేశారు.

తిరుపతమ్మ హుండీ ఆదాయం రూ.1.07 కోట్లు



హుండీల లెక్కింపులో ఈవో రమేష్‌నాయుడు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారికి భక్తులు హుండీల ద్వారా రూ.1.07 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడిగా సమర్పించారు. అమ్మవారి మండపంలో శనివారం కానుకలను లెక్కించారు. 64 రోజులకు గాను నగదు రూపంలో రూ.1,07,31,211, బంగారం 135 గ్రాములు, వెండి 350 గ్రాములు వచ్చినట్లు ఈవో కె.రమేష్‌నాయుడు తెలిపారు. అలాగే విదేశీ నగదు యూఎస్‌ఏ డాలర్లు 9, ఆస్ట్రేలియా 50, సింగపూర్ 30 డాలర్లు వచ్చాయన్నారు. కానుకలను ఆలయ సిబ్బందితో పాటు పరిటాలకు చెందిన శ్రీదుర్గా శివసాయి సేవా సమితి సభ్యులు, గ్రామానికి చెందిన భక్తులు లెక్కించారు. దేవదాయశాఖ అధికారులు పర్యవేక్షించారు.

ఉత్సవాల ద్వారా రూ.50.60 లక్షల ఆదాయం...

చిన్న తిరునాళ్ల మహోత్సవాల ద్వారా ఆలయానికి రూ.50,60,405 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.20,10,375, సేవల ద్వారా రూ.2,87,700, దర్శనాల ద్వారా రూ.8,46,350, కేశఖండనశాల టికెట్స్ ద్వారా రూ.2,87,480, తాత్కాలిక షాప్‌ల అద్దె ద్వారా రూ.16,21,000, డొనేషన్స్ ద్వారా రూ.7,500 వచ్చాయన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సహకారంతో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయన్నారు.

రిటైర్డ్ పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు



రిటైర్డ్ పోలీసు అధికారులకు వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: ప్రజలకు సుదీర్ఘకాలం పాటు సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులకు ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, ఎస్‌బీ ఏడీసీపీ కనకరాజు ఆత్మీయ వీడ్కోలు పలికారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్‌ఐలు కె.శ్రీనివాసరావు (సీసీఆర్‌బీ), ఎస్.వి.ప్రసాద్‌నాయుడు (దిశా), ఆర్.వెంకటేశ్వరరెడ్డి (సీసీఎస్), ఎం.టెన్నిపాల్ (సీఏఆర్), ఏఎస్‌ఐ ఎం.డి.వజీర్ (సీఏఆర్)లను సన్మానించారు. పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించినందుకు అభినందించారు.

బలహీన వర్గాలపై బాబు అక్కసు

- చులకన, హేళన వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ అధినేత
- గతంలో ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అన్న చంద్రబాబు
- నాయీబ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానంటూ హెచ్చరికలు
- శింగనమలలో టిప్పర్ డ్రైవర్‌కు టికెట్ ఇచ్చిన వైఎస్సార్ సీపీ
- ఆయనో టిప్పర్ డ్రైవర్ అంటూ అవమానంగా మాట్లాడిన బాబు
- మండిపడుతున్న డ్రైవర్లు, దళిత సంఘాలు

సాక్షి, మచిలీపట్నం: బడుగు, బలహీన, దళిత వర్గాలపై చంద్రబాబు ప్రదర్శిస్తున్న అహంకార వైఖరికి అడ్డు లేకుండా పోతోంది. ఆయా వర్గాలంతా ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న వైఎస్సార్ సీపీ వెంటే ఉండడం, వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలనే నిర్ణయంతో ఉన్న కారణంగా టీడీపీ అధినేత జీర్ణించుకోలేకపోతున్నారు. వారిపై అసహనం పెరిగిన ప్రతి సారి హేళనగా వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారు. ఇది ఆయనకు కొత్తేమీ కాకపోయినా ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థిపై చులకన వ్యాఖ్యలు చేశారు. శింగనమల (ఎస్సీ రిజర్వుడ్) అసెంబ్లీ నుంచి బరిలో నిలిచిన మన్నెపాకుల వీరాంజనేయులపై హేళనగా మాట్లాడారు. దీంతో చంద్రబాబుపై జిల్లా వ్యాప్తంగా డ్రైవర్లు, దళిత సంఘాల నాయకులు మండి పడుతున్నారు. డ్రైవర్లకు వాహన మిత్ర పథకం కింద ఏటా రూ.10 వేలు ఇస్తున్న జగనన్న ఇప్పుడు అసెంబ్లీకి పంపేందుకు టికెట్లు ఇస్తే.. చంద్రబాబు దురుసు వ్యాఖ్యలు చేయడం దారుణమంటున్నారు.

బాబు వ్యాఖ్యలు దుర్మార్గం



బలహీన, దళిత వర్గాల పట్ల చంద్రబాబు చిన్న చూపు తగదు. గతంలో ఎస్సీ కులంలో ఎవరు పుట్టాలనుకుంటారు.. నాయీ బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానంటూ అహంకార వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు శింగనమల వైఎస్సార్ సీపీ దళిత ఎమ్మెల్యే అభ్యర్థిని టిప్పర్ డ్రైవర్ అంటూ అవహేళన చేయడం దుర్మార్గం. దళితులు, అణగారిన వర్గాలు, పేద కూలీల పట్ల చంద్రబాబు నిజరూపం బయటపడింది.

– జక్కుల ఆనందబాబు, దళిత జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు

అవమానించడం దారుణం



ఎన్నికల్లో పోటీ చేసే డ్రైవర్‌ను చంద్రబాబు అవమానకరంగా మాట్లాడడం దారుణం. అణగారిన వర్గాలను అసెంబ్లీకి పంపాలన్నది సీఎం వైఎస్ జగన్ గొప్పదనం. అందుకే శింగనమల టికెట్ ఇచ్చారు. కానీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఒక టిప్పర్ డ్రైవర్ అని చంద్రబాబు వ్యాఖ్యానించడం డ్రైవర్లను అవమానించడమే. డ్రైవర్లు కేవలం ఓట్లు వేసేందుకే పనికి వస్తారు తప్ప ఎన్నికల్లో పోటీ చేసేందుకు అక్కరకురారు అన్నట్లు చంద్రబాబు తీరు ఉంది. టీడీపీకి బుద్ధి చెప్పి డ్రైవర్ల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి. – కంకిపాటి రమేష్, వాన్ డ్రైవర్, కంకిపాడు.

డ్రైవర్లు ఎమ్మెల్యే కాకూడదా?



టిప్పర్ డ్రైవర్‌కు జగనన్న టికెట్ ఇవ్వడం మాకు గర్వంగా ఉంది. కానీ డ్రైవర్లంటే చంద్రబాబుకు చులకన అయ్యారు. బాబుతో పాటు ఆయన కుటుంబం అడుగు బయట పెట్టాలంటే డ్రైవర్ కావాలి కానీ, ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత ఉండదా? ఓట్లు వేయాలి కానీ ఎన్నికల్లో పోటీ చేయకూడదా? ఎన్నికల్లో డ్రైవర్ల సత్తా చూపిస్తాం. ఆయన ఎలాగూ టికెట్ ఇవ్వరు. పెద్ద మనస్సుతో జగనన్న ఇస్తే దురుసుగా వ్యాఖ్యలు చేయడం తగదు.

– వెంగల నాగబాబు, డ్రైవర్, పేదపట్నం, మచిలీపట్నం మండలం

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

- కలెక్టర్ రాజాబాబు
- ఈవీఎం గోడౌన్ తనిఖీ



ఈవీఎం గోడౌన్ సీళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. సెక్యూరిటీ, తాళాల సీళ్లను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును గమనించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గోడౌన్లను తనిఖీ చేశామన్నారు. గోడౌన్‌లో ఈవీఎంలు జాగ్రత్తగా భద్రపరిచామన్నారు. ఎన్నికల నిర్వహణకు వివిధ నియోజకవర్గాలకు తగిన భద్రతతో ఈవీఎంలను పంపిస్తామని చెప్పారు. ఆయా నియోజకవర్గాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆ ప్రాంతాలకు తరలిస్తామన్నారు. కలెక్టరేట్‌లో సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. డీఆర్వో కార్యాలయానికి వెళ్లే రహదారి ఎత్తు పెంచి నిర్మించాలని పేర్కొన్నారు. చుట్టూ గ్రీనరీగా కనిపించేలా మొక్కలను ఏర్పాటు చేయాలన్నారు. ఎంయుడీఏ వీసీ పి. వెంకటరమణ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దుర్గాకిషోర్, డెప్యూటీ తహసీల్దార్ ఎంవీ శ్యామ్‌నాథ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య నివారణకు పటిష్ట చర్యలు

వేసవిలో కృష్ణా జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. కాలువలకు నీటి విడుదల, వేసవిలో తాగునీటి సరఫరా అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ఏప్రిల్ 6వ తేదీన పులిచింతల నుంచి తాగునీటి కోసం నీరు విడుదల చేస్తున్నారని చెప్పారు. జిల్లాకు అవి చేరేటప్పటికీ మూడు, నాలుగు రోజులు పట్టవచ్చని తెలిపారు. ముఖ్యంగా బందరు, బంటుమిల్లి, కృత్తివెన్ను, నాగాయలంక, కోడూరు మండలాల్లోని శివారు ప్రాంతాలకు కాలువల ద్వారా నీరు చేరేలా చూడాలని కోరారు. ఇందుకోసం కాలువలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. శివారు ప్రాంత గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. కేవలం తాగునీటికే వినియోగించేలా కాలువలపై రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్‌శాఖల సిబ్బంది సమన్వయంతో నిఘా ఏర్పాటు చేయాలని రాజాబాబు ఆదేశించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ టీజెహెచ్ ప్రసాద్‌బాబు, డీపీవో నాగేశ్వరనాయక్, డ్రెయినేజీ ఈఈ ఆర్ విజయలక్ష్మి, ఇరిగేషన్ డీఈ సీహెచ్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ కేంద్రీయ విద్యాలయ నంబర్ 1లో 2024-25 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతి, బాలవాటిక-3లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆదిశేషశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31, 2024 నాటికి 6 నుంచి 8 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పిల్లలు ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మొదటి తరగతి కోసం దరఖాస్తును ఆన్‌లైన్‌లో https://kvsonlineadmission.kvs.gov.in బాలవాటిక-3 కోసం, విద్యాలయ ప్రాంగణంలో దరఖాస్తు తీసుకోవచ్చని తెలిపారు పూర్తిచేసిన బాలవాటిక-3 దరఖాస్తులను కేంద్రీయ విద్యాలయ ప్రాంగణంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సమర్పించవచ్చని పేర్కొన్నారు. మొదటి తరగతి, బాలవాటిక-3 రిజిస్ట్రేషన్ ఏప్రిల్ ఒకటో తేదీ 10 గంటలకు ప్రారంభమై 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని వివరించారు. మరింత సమాచారానికి కేంద్రీయ విద్యాలయ వెబ్‌సైట్ https://nolvijayawada.kvs.ac.inలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

మచిలీపట్నం పీఎంశ్రీ కేవీలో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో 2024-25కు 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆరేళ్ల వయసు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. 2వ తరగతి అంతకన్నా ఎక్కువ తరగతుల్లో చేరడానికి ఖాళీలను బట్టి ఆఫ్‌లైన్ మోడ్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. అడ్మిషన్, రిజిస్ట్రేషన్ ఫారాలు విద్యాలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు.

బాలికను మోసగించిన యువకుడి అరెస్ట్

నాగాయలంక: గ్రామానికి చెందిన బాలికను మోసగించిన యువకుడిని నాగాయలంక పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం స్థానికురాలైన బాలిక(15)ను నాగాయలంకకు చెందిన పిన్ని నవభరత్ అనే యువకుడు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి ఆమెను తీసుకెళ్లిపోయాడు. దీనిపై బాలిక తండ్రి ఈ నెల 22వ తేదీ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేశారు.

ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం సదరు బాలిక పోలీసుస్టేషన్‌కు వచ్చి జరిగిన విషయాలు చెప్పింది. బాలికను మోసం చేసిన భరత్ కోసం అన్వేషిస్తున్నారు. శనివారం ఉదయం వక్కపట్లవారిపాలెం లాకుల వద్ద నిందితుడిని అరెస్ట్ చేశారు. మధ్యవర్తుల సమక్షంలో అదుపులోనికి తీసుకున్న భరత్‌ను అవనిగడ్డ జెఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్



'రన్ ఫర్ జీసస్' ర్యాలీలో కాగడాలు పట్టుకుని నడుస్తున్న తెలగతోటి జోసెఫ్, రాజారావు, టి జార్జ్ కొర్నేలియస్, దేవినేని అవినాష్, క్రైస్తవ సంఘాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో శనివారం రన్ ఫర్ జీసస్ (క్రీస్తు కోసం పరుగు) నిర్వహించారు. మృత్యుంజయుడైన క్రీస్తును స్వాగతిస్తూ కాగడాలు వెలిగించి ఆనందోత్సాహాలతో పరుగు సాగించారు. ఏపీ ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చిస్, నగర క్రైస్తవ సంఘాల సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన ఈ రన్ బెంజిసర్కిల్ సమీపంలోని సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చి వద్ద ప్రారంభమై పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, మదర్ థెరిస్సా విగ్రహం, జమ్మిచెట్టు సెంటర్, శిఖామణిసెంటర్, రెడ్‌సర్కిల్ మీదగా సూర్యారావుపేటలోని సెయింట్ పాల్స్ బసిలికా చర్చి వరకూ కొనసాగింది. రన్‌ను విజయవాడ కతోలిక పీఠం బిషప్ మోస్ట్ రెవరెండ్ తెలగతోటి జోసఫ్ రాజారావు, సీఎస్‌ఐ కృష్ణా గోదావరి డయాసిస్ బిషప్ తంటేపూడి జార్జి కొర్నేలియస్‌తో కలిసి వైఎస్సార్ సీపీ విజయవాడ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్ కాగడాలు వెలిగించి ప్రారంభించారు. ఆయన విశ్వాసులతో కలిసి మదర్‌థెరిస్సా విగ్రహం వరకు రన్‌లో పాల్గొన్నారు. అక్కడ మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా బిషప్ జోసెఫ్ రాజారావు మాట్లాడుతూ.. సిలువ మరణం ద్వారా పునరుత్థానుడైన క్రీస్తు సందేశం ప్రపంచ శాంతికి సందేశం కావాలన్నారు. మానవునికి సిలువ శక్తినిస్తుందని, సిలువ మరణాన్ని జయిస్తుందని పేర్కొన్నారు. సీఎస్‌ఐ బిషప్ కొర్నేలియస్ మాట్లాడుతూ.. 'రన్ ఫర్ జీసస్' ప్రపంచ శాంతికి నాంది కావాలని పిలుపునిచ్చారు. అన్ని క్రైస్తవ సంఘాలు ఒకే వేదిక మీదకు వచ్చి ప్రపంచ శాంతికోసం 14 ఏళ్లుగా ఏసు కోసం పరుగు నిర్వహిస్తూ క్రైస్తవుల ఐక్యతను తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయవాడ కతోలిక పీఠం మోన్సిన్వోర్ రెవరెండ్ మువ్వల ప్రసాద్, నిర్వాహకులు రెవరెండ్ అల్లూరి విశ్వప్రసాద్, బెల్లంకొండ శివాజీ రాజు, ఎస్.జయకుమార్‌బాబు, శీలం ప్రవీణ్, రెవరెండ్ రబ్బానీ, సిరిపురపు గ్రిటన్, రెవరెండ్ ఐ.కరుణానిధి తదితరులు పాల్గొన్నారు. ఈ రన్‌లో వేలాదిగా క్రీస్తు విశ్వాసులు పాల్గొని జయహో క్రీస్తు రాజా.. జయం జయం, మృత్యుంజయుడైన క్రీస్తు జయం జయం అంటూ నినదించారు.

అనధికార లే ఔట్లు ధ్వంసం


మైలవరం మండలంలో అక్రమ లే ఔట్లను ధ్వంసం చేయిస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ అనుమతి లేకుండా అక్రమంగా వేసిన లే ఔట్లను అధికారులు ధ్వంసం చేశారు. మైలవరం మండలం మైలవరం, పొందుగుల, సబ్బాపాడు గ్రామాల్లో శనివారం ప్రభుత్వ అనుమతి లేకుండా వేసిన అక్రమ లే ఔట్లను సీఆర్‌డీఏ అధికారులు పొక్లెయిన్లతో తొలగించారు. వ్యవసాయ భూముల్లో అక్రమంగా వేసిన లే ఔట్లను గుర్తించి సర్వే రాళ్లను తొలగించాలని సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ భూములకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రోడ్లను నిర్మించి ప్లాట్లుగా విడగొట్టి ప్రజలకు విక్రయిస్తే ప్రభుత్వాదాయానికి భారీగా గండిపడుతుందని పేర్కొన్నారు. పొందుగుల గ్రామంలోని సర్వే నెంబర్ 425-1ఏ1, 1ఏ3, 1బీ1, 1బీ3, 48-2(పి), 475-2(పి) , 478-3(పి), సబ్బాపాడు గ్రామంలో సర్వే నెంబర్ 82-1ఏ, 1బీ, 2ఏ,2బీ నంబర్లలో లే ఔట్లను ధ్వంసం చేశామన్నారు. అనధికార లే ఔట్లలో ప్లాట్లు విక్రయిస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇలాంటి లే ఔట్లలో ప్లాట్లు కొని మోసపోవద్దని హెచ్చరించారు. ఇలాంటిచోట భవన నిర్మాణాలకు అనుమతి ఇవ్వరని పేర్కొన్నారు. అనధికార లే ఔట్లు, అక్రమ నిర్మాణాలు చేపడితే వివరాలు 70955 99838 నంబరుకు వాట్సాప్ చేయాలన్నారు. 0866- 2527154 నంబరులో సంప్రదించాలని కోరారు.

మద్యం అక్రమ రవాణాను అడ్డుకుంటాం

ఎక్సైజ్ ఎస్పీ ఆవులయ్య


మాట్లాడుతున్న ఆవులయ్య

అవనిగడ్డ: కృష్ణా జిల్లాలో మద్యం అక్రమ రవాణా, బెల్టు షాపులను అడ్డుకుంటామని ఎక్సైజ్ ఎస్పీ ఎ.ఆవులయ్య చెప్పారు. ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడుతూ ఎన్నికల వేళ మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జిల్లాలో 123 మద్యం దుకాణాలు ఉన్నాయని వీటి పరిధిలో ఎక్కడన్నా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్టు షాపుల నిర్వహణ, మద్యం అక్రమ సరఫరాపై సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కప్తానుపాలెం, కోడూరు, కైకలూరులో మద్యం అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వలంటీర్లను విధుల నుంచి తొలగించి వారిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. గొలుసు దుకాణాలు నిర్వహిస్తే ప్రజలు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని విస్తృత తనిఖీలు చేపడుతున్నట్టు ఎస్పీ ఆవులయ్య తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐలు పాల్గొన్నారు.

8 కేజీల గంజాయి స్వాధీనం

రామవరప్పాడు: ఆర్టీసీ బస్సులో ఇద్దరు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న 8 కేజీల గంజాయిను పోలీసులు గూడవల్లి చెక్ పోస్టు వద్ద శుక్రవారం రాత్రి స్వాధీనపరుచుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల సందర్భంగా డీసీపీ అదిరాజ్ సింగ్ రాణా నేతృత్వంలో సెంట్రల్ ఏసీపీ భాస్కర రావు పర్యవేక్షణలో సిబ్బంది గూడవల్లి చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీలు చేశారు. ఈనెల 29న రాత్రి విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆపి తనిఖీలు నిర్వహించారు. బస్సులో అనుమానాస్పదంగా ఉన్న అసోం, నవగావ్ జిల్లాకు చెందిన అబ్దుల్ రఫిక్, బెంగుళూరుకు చెందిన ముజామిల్ బాషా బస్సు దిగి పారిపోయేందుకు ప్రయత్నించారు. వీరిని అదుపులోకి తీసుకుని బ్యాగ్‌లను సోదాలు చేశారు. ఒక్కొక్క బ్యాగ్‌లో 4 కేజీల చొప్పున రెండు బ్యాగ్‌లలో 8 కేజీల గంజాయి ప్యాకెట్లను పోలీసులు గుర్తించారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి బెంగుళూరు తీసుకెళ్తున్నట్లుగా విచారణలో గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు వారిద్దరినీ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో పటమట సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ సతీష్ కుమార్, ఎస్ఎస్‌టీ టీమ్ ఇన్‌చార్జి జి. సతీష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

'సిద్ధ విద్యాపీఠం'లో అగ్ని ప్రమాదం

రూ.2 లక్షల ఆస్తినష్టం



పాపవినాశనం(ఘంటసాల): ఘంటసాల మండలం పాపవినాశనంలోని సిద్ధ విద్యాపీఠం ఆశ్రమంలో అగ్ని ప్రమాదం జరిగినట్లు ఆశ్రమం ప్రతినిధులు తెలిపారు. విద్యాపీఠం ఆశ్రమంలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఆశ్రమంలోని ధ్యానమందిరం రెల్లుగడ్డితో కప్పి ఉండటంతో మంటలు వ్యాపించాయి. వెంటనే మొవ్వ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పిందని ఆశ్రమ సిబ్బంది తెలిపారు. గురువు కృప, భగవంతుని అనుగ్రహంతో ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగలేదని విద్యాపీఠం ప్రతినిధి పిల్లలమర్రి లక్ష్మీదేవి చెప్పారు.. ఫైర్ ఆఫీసర్ గుమ్మడి వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు కేర్‌లెస్ స్మోకింగ్‌తో ప్రమాదం జరిగిందని, రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని తెలుస్తోంది.

సమన్వయంతో పని చేయండి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, ఈవీఎం కమిషనింగ్, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ ఢిల్లీరావు శనివారం వీఎంసీ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గ ఆర్వో స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఇందిరాగాంధీ స్టేడియాన్ని సందర్శించారు. అక్కడ తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. వేసవి దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.